క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు పరిధిలోని పలు కాలనీలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ అధికారులు వెల్లడించారు. 11కేవీ జర్నలిస్టు కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లలో మెయింటెనెన్స్ పనులు కారణంగా ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిచిపోతుందన్నారు. మర్రిపాలెం వుడా లేఅవుట్, గాంధీనగర్, నేతాజీనగర్, రైతుబజార్ ఏరియా, జర్నలిస్టు కాలనీ, పాస్‌పోర్టు ఆఫీస్ ఏరియా, రిలయన్స్ పెట్రోల్ బంక్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మల్కాపురం: శ్రీహరిపురం సబ్ స్టేషన్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్ – 2 ఈఈ బి.శివనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ములగాడ హౌసింగ్ కాలనీ, కొత్త నక్కవానిపాలెం, పాత చెరువాను ఏరియా, గాజువాక ఆర్టీసీ డిపో ఏరియా, ఎస్ సర్వీస్‌మెన్ కాలనీ, హనుమాన్‌నగర్, గణపతినగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

ఆకట్టుకున్న కోలాటం



కోలాటం ఆడుతున్న మహిళలు

విశాఖ విద్య: ఎమ్‌వీపీ కొత్తరోడ్‌లో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ప్రత్యేక అలంకరణ చేసిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. పరిసర కాలనీలకు చెందిన పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మహిళల కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. గౌరీ సేవా సంఘం పెద్దలు తగిన ఏర్పాట్లు చేశారు.

‘బడి’లో సమస్యలు పట్టవా!

- నాడు–నేడు నిధులకు మోకాలడ్డు
- అసంపూర్తిగా అభివృద్ధి పనులు
- అసౌకర్యాల నడుమ సాగుతున్న చదువులు



పాఠశాలలో అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో పాత బెంచీలపై కూర్చొన్న విద్యార్థులు



బోసిపోయినట్టు కనిపిస్తున్న లక్ష్మీనగర్ ఈ బ్లాక్ స్కూల్

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు గూడు కట్టుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్భాటపు ప్రచారానికి తప్పా క్షేత్ర స్థాయిలో సమస్యలపై దృష్టి పెట్టకపోవడంతో సర్కారు బడుల్లో అసౌకర్యాల నడుమ విద్యార్థుల చదువులు సాగుతున్నాయి.

నాడు ప్రభుత్వ పాఠశాలలకు పెద్దపీట

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను ఎన్నడూ లేని రీతిలో అభివృద్ధి చేసింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు–నేడు పనుల నిధులకు మోకాలడ్డడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కొద్దిపాటి నిధులు మంజూరు చేస్తే కనీసం రంగులైనా వేసుకుంటామని పాఠశాల యాజమాన్య కమిటీలు, ఉపాధ్యాయులు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోకపోవడం శోచనీయం.

నేడు అర్ధాంతరంగా నిలిచిన పనులు

గోపాలపట్నం మండలం పరిధిలోకి వచ్చే పాఠశాలలు చినగదిలి, విశాఖ పట్నం అర్బన్ పరిధిలో ఉండేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రెండు మండలాల్లో తొలి దశలో 38 స్కూళ్లను రూ.10.49 కోట్లతో అభివృద్ధి చేశారు. తొలిదశ పనులు చేపట్టిన స్కూళ్లన్నీ సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్నాయి. రెండో విడతలో విశాఖ అర్బన్ పరిధిలో 6 స్కూళ్లను అభివృద్ధి చేయడంతోపాటు కొన్ని చోట్ల అదనపు గదుల నిర్మాణం చేపట్టేలా మొత్తం రూ.5.25 కోట్లతో ప్రతిపాదనలు చేసి పనులు ప్రారంభించారు. పనులన్నీ ఆఖరి దశకు చేరుకునే సమయంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో నాడు–నేడు పనులన్నీ ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి.

వెంటాడుతున్న అసౌకర్యాలు

పశ్చిమ నియోజకవర్గం పరిధిలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం అసౌకర్యాల నడుమ విద్యార్థుల చదువులు సాగుతున్నాయి. నాడు–నేడు పనుల్లో భాగంగా పాఠశాల భవనాలకు మరమ్మతులు చేసినప్పటికీ నిధులు మంజూరు కాక



అసంపూర్తిగా నిలిచిన మరుగుదొడ్లు

పోవడంతో రంగులు వేయకుండా వదిలేశారు. దీంతో పాఠశాలలు కళావిహీనంగా కనిపిస్తున్నాయి. అదే విధంగా విద్యార్థుల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్లు సైతం అసంపూర్తిగా నిలిచిపోయాయి. గోపాలపట్నం మండలం లక్ష్మీనగర్– ఇ బ్లాక్ ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం ఇలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఇక్కడ మరుగుదొడ్లు కోసం శ్లాబ్ వేసి నిధులు లేక అలాగే వదిలేశారు. ఇదొక్కటే కాదు..నియోజకవర్గంలో నాడు–నేడు రెండో విడతలో చేపట్టిన స్కూళ్లలో పనులు ఇలా అసంపూర్తిగానే మిగిలాయి. దీంతో విద్యార్థుల చదువులు అసౌకర్యాల నడుమ సాగుతున్నాయి.

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



కార్యక్రమంలో పాల్గొన్న జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు

మల్కాపురం: మల్కాపురం శాఖ గ్రంథాలయంలో గురువారం నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు శాఖ గ్రంథాలయ అధికారి అజేయ్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మల్కాపురం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అజేయ్ మాట్లాడుతూ గురువారం ఉదయం 10 గంటలకు వారోత్సవాల ప్రారంభోత్సవం ఉంటుందని,పలు పాఠశాలల విద్యార్థులకు తొలి రోజు దేశభక్తి గీతాలపై పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.15న గ్రంథాలయంలో వివిధ పుస్తకాల ప్రదర్శన, 16న విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. 17న కవి సమ్మేళనం ,18న భారత రాజ్యాంగంపై క్విజ్ పోటీ ఉంటుందన్నారు.19న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వివరించారు. 20న ముగింపు కార్యక్రమంలో భాగంగా పోటీల్లో విజేతలకు అతిథుల చేతులమీదుగా బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు.

ప్రతి విద్యార్థికీ అపార్ ఐడీ

- వివరాలు తక్షణమే అప్‌లోడ్ చేయాలి
- ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులకు డీఈవో ప్రేమ్ కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్ కుమార్

విశాఖ విద్య: ప్రైవేట్ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)లో నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ ఆదేశించారు. గోపాలపట్నం,పెందుర్తి మండలాల ప్రైవేట్ స్కూళ్ల నిర్వాహకులతో బుధవారం పురుషోత్తపురంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు అపార్‌లో నమోదు ఎంతో అవసరమన్నారు. పాఠశాలల లాగిన్‌లో వెంటనే నమోదు చేయాలన్నారు. ఏ స్కూల్ లాగిన్‌లో ఒక్క విద్యార్థికి సంబంధించిన వివరాలు కూడా పెండింగ్‌లో ఉండకూడదని హెచ్చరించారు. ఫార్మేటివ్ 1, 2 పరీక్షల మార్కులను కూడా వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. పాఠశాలల్లో చదవని విద్యార్థుల వివరాలు లాగిన్‌లో ఉంటే వర్యలు తప్పవని హెచ్చరించారు. అపార్ ఐడీ జనరేట్ చేయడంలో ఎవరికైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి వచ్చే ఉత్తర్వులను తప్పనిసరిగా పాటించడంతో పాటు అడిగిన వివరాలు సకాలంలో అందజేయాలన్నారు. పలువురు కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు అడిగిన సందేహాలను ప్రేమ్ కుమార్ నివృత్తి చేశారు. అంతకు ముందు మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలల్లో ప్రస్తుతం చేపట్టాల్సిన పనులను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో రవీంద్రబాబు, ఎంఈవోలు సోమేశ్వరరావు,దివాకర్, డీటీ శ్రీనాథరావు, మధుమూర్తి తో పాటు సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

24 గంటల్లో చోరీ కేసు ఛేదన

18 తులాల బంగారం, 50 తులాల వెండి ఆభరణాల రికవరీ



మీడియాతో మాట్లాడుతున్న ఏసీపీ మోహనరావు

మల్కాపురం: వ్యసనాలకు బానిసై దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తి వివరాలే పోలీసులకు చిక్కాడు. పోలీసులు 24 గంటల్లోనే కేసును ఛేదించి, దొంగను పట్టుకుని, ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మల్కాపురం క్రైం పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఏడీసీపీ మోహనరావు వివరాలను వెల్లడించారు. 60వ వార్డు ఎంజిజి కాలనీ, క్వార్టర్స్ నెం.175లో మాజీ నేవీ ఉద్యోగి శివప్రసాదరెడ్డి తన భార్యతో కలిసి ఉద్యోగ ఉంటున్నారు. ఈ నెల 4న తన స్వస్థలైన బీహార్‌కు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. 10న ఇంటికి తిరిగి వచ్చి చూడగా ప్రధాన ద్వారానికి వేసిన తాళం విరిగి ఉంది. గదిలోకి వెళ్లి పరిశీలించగా 18 తులాల బంగారు నగలు, 50 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించి, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. 11న కేసు నమోదు చేసిన క్రైం పోలీసులు దొంగ తనం జరిగిన ఇంటి పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. స్థానిక జర్నలిస్ట్ కాలనీ ప్రాంతంలో అద్దెకు ఉంటున్న దాసరి వరాహ హరి అనే వ్యక్తి దొంగతనం జరిగిన ఇంటి పరిసరాల్లో రెక్కీ నిర్వహించిన విషయాన్ని గుర్తించారు. దీని ఆధారంగా నిందితుడు హరిని మంగళవారం అదుపులోకి తీసుకుని, తమదైన రీతిలో విచారించగా నిజాన్ని అంగీకరించారు. బుధవారం ఆ వ్యక్తిని అరెస్ట్ చేసి, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్టు ఏడీసీపీ మీడియాకు వెల్లడించారు.

వ్యసనాలకు అలవాటుపడి...

నిందితుడు రాజమండ్రి ప్రాంత వాసి. బర్మాకాలనీలో అద్దెకు ఉంటున్నాడు. ఇతనికి భార్య, బాబు ఉన్నారు. కుమారుడికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో భార్య రాజమండ్రి వద్ద ఉండి కుమారుడి యోగక్షేమాలను చూసుకుంటోంది. నిందితుడు తొట్ల ఆటో నడుపుతూ బర్మాకాలనీలో ఒంటరిగానే ఉంటున్నాడు. ఇతను పాత నేరస్తుడు కాదని, వ్యసనాలకు అలవాటుపడి, డబ్బు కోసం ఈ దొంగతనానికి పాల్పడినట్టు ఏడీసీపీ తెలిపారు. సమావేశంలో క్రైం ఏసీపీ లక్షణరావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ ఎన్‌వీ రమణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బాక్సింగ్ విజేతలకు అభినందనలు



బాక్సింగ్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులతో కోచ్‌లు

మల్కాపురం: స్థానిక వైట్ టైగర్ బాక్సింగ్ క్లబ్‌లో శిక్షణ పొందిన అలెక్స్, బి.షర్మిల ఇటీవల భోపాల్‌లో నిర్వహించిన జూనియర్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ చాటారు. అలెక్స్ 37 కేజీల విభాగంలో, షర్మిల 42 కేజీల విభాగంలో ప్రత్యర్థులతో తలపడి విజయం సాధించారు. వీరు అక్కడ విజయం సాధించి నగరానికి చేరుకోవడంతో కోచ్‌లు ప్రసాద్, అలీ తదితరులు అభినందించారు. 60వ వార్డు గుల్లలపాలెం సమీపంలోని వాకింగ్ పార్కు వద్ద బుధవారం ఉదయం కాలువాలతో సత్కరించి అభినందించారు.

బడ్జెట్‌లో దళితులకు అన్యాయం



మాట్లాడుతున్న డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్

సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 11న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో ఎస్సీ, ఎస్టీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ కోరారు. రామాటాకీస్ రోడ్‌లో గల అంబేడ్కర్ భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరానికి సంబంధించి ఎస్సీల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.48 వేల కోట్ల నిధులు కేటాయించాల్సి ఉండగా రూ.18,497 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఎస్టీ సంక్షేమానికి రూ.21 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా రూ.7,557 కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. బడ్జెట్‌లో దళిత, గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని మండిపడ్డారు. సమావేశంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాంబాబు, మాటూరి శ్రీనివాసరావు, పతివాడ రాంబాబు, అప్పలకొండ, రాజాన సరస్వతి పాల్గొన్నారు.

విజయవంతంగా నేవల్ ఫ్లైట్ సేఫ్టీ సెమినార్



వార్షిక నేవల్ ఫ్లైట్ సేఫ్టీ సెమినార్–2024లో పాల్గొన్న నేవీ అధికారులు

సింధియా: తూర్పు నావికాదళ కమాండ్ హెడ్ క్వార్టర్స్ ఆధ్వర్యంలో విశాఖలోని ఐఎన్‌ఎస్ డేగా వద్ద వార్షిక నేవల్ ఫ్లైట్ సేఫ్టీ సెమినార్–2024 ప్రారంభమైంది. తూర్పు నావికాదళ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ కీలకోపన్యాసం ఇచ్చారు. సముద్రంలో ఉద్భవిస్తున్న బెదిరింపులు, వాటి సవాళ్లు, నౌకాదళ వైమానిక కార్యకలాపాలు, సముద్రంపై విమాన భద్రత వర్ధిల్లు అనే అంశంపై సమకాలీన అంశాలతో కూడిన సెమినార్ ఆకట్టుకుంది. సాంకేతిక లోపాలను అధిగమిస్తూ నూతన వ్యూహాలతో ఏవియేషన్ కార్యకలాపాల్లో పురోగతి సాధించడంపై చర్చించారు. వైమానిక ఆస్తుల పరిరక్షణతో విజిలెన్స్ అవసరాన్ని తెలుపుతూ సముద్రదేళ ప్రాంతాల్లో క్రియాశీల భద్రత కోసం విజిలెన్స్ మరింత దురుగ్గా పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నేవీ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ధరల పెరుగుదలతో ప్రజలపై భారం



గొల్లలకంచరపాలెం సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కంచరపాలెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో నిత్యావసర సరకుల ధరలు పెరిగిపోయాయని, ప్రజలపై అధిక భారం పడుతున్నారని సీపీఎం కంచరపాలెం జోన్ కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ అన్నారు. ప్రభుత్వాల తీరుకు నిరసనగా జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం దేవేంద్రనగర్ సచివాలయం, 56వ వార్డు గొల్లలకంచరపాలెం సచివాలయం ఆవరణలో కంచరపాలెం జోన్ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యావసర సరకుల ధరలు, పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేయొద్దని కోరారు. ప్రజల సమస్యలపై అసెంబ్లీలో కూటమి నాయకులు చర్చించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు పూనుకోవాలన్నారు. నాయకులు సానబోయిన సోమేశ్వరరావు, ఎం.ఈశ్వరరావు, ఒమ్మి అప్పారావు, ఒమ్మి విజయ, జె.శ్రీనివాసరావు, కె.శ్యామల, బి.భవానీ, రాంబాబు, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

గణపతికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న గణనాథుడు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లే అవుట్‌లో వెలసిన ఉన్న శ్రీ వరసిద్ధి వినాయకుడికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గణపతికి పంచామృతాలతో అభిషేకం జరిపించారు. ప్రత్యేక అలంకరణ అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు గోత్రనామాలతో పూజలు నిర్వహించిన అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

మల్కాపురం: మానవ మనుగడకు మొక్కలే ఆధారం అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని విశాఖ ఇండస్ట్రియల్ ఏరియా కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ అధ్యక్షుడు దేవర అప్పలరాజు యాదవ్ అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో 59వ వార్డు నక్కవానిపాలెంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఒక్కరూ తమ తమ ఇళ్ల వద్ద కనీసం రెండు మొక్కలు పెంచాలన్నారు. అంతా ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలంటే మొక్కలు నాటాలని కోరారు.

17న రక్తదాన శిబిరం

విశాఖ విద్య: మమత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 17న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఎల్లేటి మమత ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌ఏడీ బీఎస్‌పీ ఏరియాలోని నిర్వహించిన శిబిరంలో ఉచితంగా దంత పరీక్షలు కూడా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యువత తరలి వచ్చి రక్తదానం చేయాలని కోరారు. దంత వైద్యశిబిరాన్ని చుట్టు పక్కల కాలనీ వాసులు వినియోగించుకోవాలన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

విశాఖ విద్య: గోపాలపట్నం శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి ఈ నెల 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు లైబ్రేరియన్ ఎస్. ప్రేమ్ కుమార్ తెలిపారు. విద్యార్థులకు పోటీలు, పుస్తక ప్రదర్శన, కవి సమ్మేళనం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఉద్రిక్తత

- నిబంధనలకు విరుద్ధంగా ముందుకొచ్చిన షాపులు
- తొలగించాల్సిందేనన్న జెడ్సీ
- కొద్దిసేపు వాదించి... వారం రోజులు గడువు కోరిన వ్యాపారులు



షాపింగ్ కాంప్లెక్స్ వద్ద జీవీఎంసీ అధికారులతో వాదిస్తున్న వ్యాపారులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద బుధవారం ఉదయం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. నిబంధనలకు విరుద్ధంగా సేవా మార్గాన్ని మూసివేసేలా ఏర్పాటు చేసిన దుకాణాలు తొలగించాలని అధికారులు ఆదేశించడంతో... తమను వ్యాపారాలు చేసుకోనివ్వరా..?, ఎలా బతకాలంటూ..? వ్యాపారులు కొద్దిసేపు వాదించారు. వివరాలు వారం రోజులు గడువిస్తే ముందుకొచ్చిన దుకాణాలు తొలగిస్తామని లిఖితపూర్వకంగా వ్యాపారులు అంగీకరించడంతో వివాదం సద్దుమణిగింది. అసలేం జరిగిందంటే... ఇక్కడి షాపింగ్ కాంప్లెక్స్ రక్షణ గోడను ఆనుకుని, చేపల మార్కెట్‌కు వెళ్లే దారిలో కొంత మంది నిబంధనలకు విరుద్ధంగా సేవా మార్గాన్ని మూసేసి కూరగాయల వ్యాపారం సాగిస్తున్నారు. ఫలితంగా షాపుల వద్దకు వచ్చే కొనుగోలుదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీంతో కొంత మంది ఫిర్యాదు చేయడంతో స్పందించిన జోన్ – 5 జెడ్సీ రాము సిబ్బందితో కలిసి బుధవారం ఉదయం అక్కడకు వచ్చి సమస్యను గుర్తించారు. ఆ సమయంలో ఫిర్యాదు చేసిన వారితో వ్యాపారులు వాగ్వాదానికి దిగారు. వెంటనే అధికారులు కలుగజేసుకుని నిబంధనలకు విరుద్ధంగా ముందుకొచ్చిన వ్యాపారాలు సాగించడం తప్పు అని... వీటిని తొలగిస్తారా..?, లేదా తమనే తొలగించమంటారా..? అని ప్రశ్నించారు. దీంతో వ్యాపారులు తమకు వచ్చే బుధవారం వరకు గడువు కావాలని కోరారు. దీంతో అక్కడ ప్రశాంత వాతావరణం నెలకొంది.

హాకర్స్ జోన్ ఏర్పాటు చేసినా...

60వ వార్డు గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపులకు ఒక్కొక్కరు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు జీవీఎంసీకి అద్దె చెల్లిస్తూ వ్యాపారాలు చేస్తున్నారు. అయితే వీటికి సమీపానే రక్షణ గోడను ఆనుకుని మరికొంత మంది కూరగాయల వ్యాపారం సాగిస్తున్నారు. వీరు నిబంధనల అతిక్రమించి ముందుకొచ్చేయడంతో షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపులకు వచ్చే వారికి ఇబ్బందికరంగా మారింది. కూరగాయల వ్యాపారాల కోసం షాపింగ్ కాంప్లెక్స్ వెనుక లక్షలాది రూపాయలతో హాకర్స్ జోన్ ఏర్పాటు చేశారు. అయినప్పటికీ వీరు అక్కడకు వెళ్లకుండా దర్జాగా గోడ పక్కన తిష్ట వేసి వ్యాపారాలు సాగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.